క్లుప్తంగా

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని వినతి



ఇబ్రహీంపట్నం: ఖరీఫ్ సీజన్‌లో పచ్చిరొట్ట విత్తనాలు 90 శాతం సబ్సిడీపై సకాలంలో అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యలమందరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నంలో డెప్యూటీ తహసీల్దార్ మహేష్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలతో పాటు వరి వంగడాలు సైతం 90 శాతం సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని, గ్రామ సభలు నిర్వహించి పొలం యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రైతులు, కౌలు రైతులకు ఎటువంటి హామీ లేకుండా రూ.2లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ వాసు, మల్నీడి రవి పాల్గొన్నారు.

నగర పంచాయతీ కమిషనర్ బదిలీ

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు నందిగామ బదిలీ అయ్యారు. కదిరిలో పనిచేస్తున్న కె. మనోజ తిరువూరు నగర పంచాయతీ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. తిరువూరు నగర పంచాయతీలో కీలక అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ లోవరాజు సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని పలువురు అభినందించారు.

అగ్ని బాధితుడికి నిత్యావసరాలు అందజేత



లక్ష్మీపురం(తిరువూరు): మండలంలోని లక్ష్మీపురంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితుడికి నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు గంజా కృష్ణమోహన్ మంగళవారం సాయం అందజేశారు. గ్రామానికి చెందిన బాలమర్తి పెదరాములుకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. అగ్నిప్రమాదంలో గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. కట్టుబట్టలతో మిగిలిన పెదరాములు కుటుంబానికి నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, దుస్తులను కృష్ణమోహన్ అందజేశారు.

డ్రెయినేజీల్లో పూడిక తొలగింపు

నూజివీడు: పట్టణంలోని డ్రెయినేజీల్లో పూడిక తొలగింపు పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. బస్టాండు రోడ్డు, పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్ వరకు, పీజీ సెంటర్ రోడ్డు, హనుమాన్ జంక్షన్ రోడ్డులోని డ్రెయినేజీల్లో పూడిక తొలగింపు పనులను చేపట్టారు. డ్రెయినేజీల్లో మట్టి, చెత్తాచెదారం పేరుకుపోయి వర్షాకాలంలో వర్షపు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో సిబ్బంది డ్రెయినేజీల్లో పూడికతీత పనులను చేపట్టారు. రూ.20 లక్షల అంచనాతో ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

బస్‌స్టాండ్‌లో బీఎల్‌డీసీ ఫ్యాన్ల ఏర్పాటు

తిరువూరు: తిరువూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం అధునాతనమైన, తక్కువ విద్యుత్ వినియోగంతో పనిచేసే బీఎల్‌డీసీ ఫ్యాన్లను ఏర్పాటు చేశామని డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్ర ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ ఈ ఫ్యాన్లను సరఫరా చేసిందన్నారు. వీటి వల్ల విద్యుత్ వాడకం తగ్గడంతో పాటు పర్యావరణానికి హాని కలుగకుండా ఇవి పనిచేస్తాయని చెప్పారు.

యోగాంధ్ర సాధన అందరి బాధ్యత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యోగాంధ్ర సాధన పౌరులందరి బాధ్యత అని కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, టి.శ్రీనివాసులు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 1,500 మంది విద్యార్థులతో యోగా సాధన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాల విద్యా ప్రణాళికలో యోగాను భాగంగా చేర్చామని, నిత్యం ప్రతి విద్యార్థి యోగా సాధన చేసేలా టైంటేబుల్ అమలు చేస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం యోగాను చదువులో భాగం చేయాలని సూచించిందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డి.హేమచంద్రరావు, యోగా శిక్షకులు గౌరీనాథ్ విద్యార్థులతో యోగా సాధన చేయించారు. కమిటీ సభ్యులు బీవీ బాలకోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.రామకృష్ణ, పీఎల్ రమేష్, డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మారని దారిద్ర్యం

- అధ్వానంగా రహదారులు
- గుంతల రోడ్లతో రాకపోకలకు ఇబ్బందులు
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు
- కనీస మరమ్మతులకు నోచుకోని గ్రామీణ రహదారులు



తిరువూరు మండలం అక్కపాలెం వెళ్లే రహదారి దుస్థితి

తిరువూరు: తిరువూరు సబ్ డివిజన్‌లోని ఆర్ అండ్ బీ రహదారులు గుంతలమయంగా మారాయి. ఈ రోడ్లపై వాహనాల రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్ బీ సబ్ డివిజన్‌లో 12 రహదారులకు గతంలో మరమ్మతు పనుల నిమిత్తం రూ.4 కోట్లకు పైగా నిధులు మంజూరు కాగా పనులను తూతూ మంత్రంగా నిర్వహించారు. తిరువూరు నుంచి పలు గ్రామీణ ప్రాంతాలను కలిపే రహదారుల పరిస్థితి దారుణంగా ఉందని ప్రజా సంఘాలు పలుమార్లు ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించినా అధికారులు స్పందించడం లేదు.

నిత్యం ప్రమాదాలు..

తిరువూరు నుంచి కోకిలంపాడు మీదుగా అడసర్లపాడు వరకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి ఐదు కిలోమీటర్ల మేర పూర్తిగా ధ్వంసమైంది. ఖమ్మం జిల్లా నుంచి వివిధ పనుల నిమిత్తం తిరువూరు వైపునకు వచ్చే ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డుపై ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో గోతులు కనిపించక వాహన చోదకులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ రహదారిని విస్తరించి పునర్నిర్మించేందుకు గతంలో రూ.3 కోట్ల నిధులు మంజూరైనా పనులు జరగలేదు. తిరువూరు నుంచి అక్కపాలెం మీదుగా ఖమ్మం జిల్లా రఘునాథ బంజరు, చంద్రుపట్ల, కల్లూరు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారిది సైతం ఇదే పరిస్థితి. తిరువూరు నుంచి అక్కపాలెం వద్ద ఏపీ సరిహద్దు వరకు రోడ్డు అధ్వానంగా మారింది. పలుమార్లు పడమటివాగుకు వచ్చిన వరదల కారణంగా రహదారి కోతకు గురై ద్విచక్ర వాహనాల రాకపోకలకు సైతం వీలులేని విధంగా మారింది. ఈ రహదారిలో పడమటివాగుపై 35 సంవత్సరాల కిందట నిర్మించిన లో లెవెల్ వంతెన కూడా పూర్తిగా శిథిలమై ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. తిరువూరు-పుట్రేల, తిరువూరు-మధిర ఆర్ అండ్ బీ రహదారులు పలుచోట్ల ధ్వంసమయ్యాయి.

మరమ్మతులు చేయాలని వినతి

ధ్వంసమైన రహదారులను పునర్నిర్మించే వరకు కనీసం మరమ్మతులైనా చేయాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. మార్జిన్లు కోతకు గురై రాత్రి వేళల్లో కనీసం ఎదురుగా వచ్చిన వాహనాలు తప్పుకునే వీలులేక ప్రమాదాలకు గురవుతున్నందున గోతులు పూడ్చి వాహనాల రాకపోకలకు వీలుగా చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఐదు కిలో మీటర్లు తిరిగి వెళ్తున్నాం

తిరువూరు నుంచి అక్కపాలెం వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ రహదారిపై వెళ్లే వీలు లేక ఐదు కిలోమీటర్లు చుట్టూ తిరిగి మునుకుళ్ల మీదుగా రాకపోకలు సాగిస్తున్నాం. స్కూల్ పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు.

– కీసర నాగిరెడ్డి, అక్కపాలెం



మరమ్మతులు చేయాలి

నిత్యం రద్దీగా ఉండే రహదారులు పాడైపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడ లేదు. తిరువూరు మండలంలోని అన్ని రహదారుల పరిస్థితి ఇలాగే ఉన్నప్పటికీ కనీసం మరమ్మతులు కూడా చేయించడం లేదు. గుంతలు పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలి.

– కె. శ్రీనివాసరావు, అక్కపాలెం

చిరస్మరణీయుడు పైడిమర్రి



నివాళులర్పిస్తున్న అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు



మల్లేల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

తిరువూరు: భారతదేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తూ భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞ రచించిన పైడిమర్రి వెంకట సుబ్బారావు చిరస్మరణీయుడని అభ్యుదయ రచయితల సంఘ జిల్లా కార్యదర్శి రేపాక రఘునందన్ అన్నారు. తిరువూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో పైడిమర్రి జయంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రఘునందన్, రచయితల సంఘ అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞలోని విశిష్టతను వక్తలు వివరించారు. రచయితల సంఘ సభ్యులు వజ్రాల ఇందిర తదితరులు పాల్గొన్నారు.

- మల్లేల(తిరువూరురూరల్): భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి కార్యక్రమం మండలంలోని మల్లేల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. పైడిమర్రి జీవిత చరిత్ర రచయిత ఎం. రాంప్రదీప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేషంరాజు, ఉపాధ్యాయులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను వారు కొనియాడారు.
- తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను షిర్డీ సాయి బాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి కార్యక్రమం నిర్వహించారు. సాయిబాబా సేవా కమిటీ అధ్యక్షుడు నారాయణరావు మాట్లాడుతూ నేటి విద్యార్థులకు భారతదేశ విశిష్టతను తెలియజేసే విధంగా పైడిమర్రి రచించిన ప్రతిజ్ఞ ప్రతి పాఠశాలలో ప్రతి విద్యార్థి నిత్యం పఠిస్తుండటం గర్వకారణమన్నారు. పైడిమర్రి రచనలు భారతదేశ నాగరికతను, ప్రజల జీవనశైలిని చాటిచెబుతాయని వివరించారు. సేవా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యం



చిన్నాగిరిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ

ఆగిరిపల్లి: గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ అన్నారు. మంగళవారం మండలంలోని చొప్పరమెట్ల, చిన్నాగిరిపల్లి, తోటపల్లి, ఆగిరిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. చొప్పరమెట్లలోని ఉపాధి హామీ పనులను పరిశీలించి, గ్రామంలో మామిడి తోటలో రైతు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత వల్ల కలిగే ఉపయోగాలను తెలుసుకున్నారు. చిన్నాగిరిపల్లిలోని గులాబీ తోటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం తోటపల్లిలోని గోకులం షెడ్డుని ఆయన ప్రారంభించారు. గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగిరిపల్లిలో ఇంటి పన్ను బకాయిలను వారంలోగా వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏలూరు డీపీఓ అనురాధ, డ్వామా పీడీ సుబ్బారావు, నూజివీడు డీఎల్‌పీఓ సుందరి, ఎంపీడీఓ భార్గవి, ఈఓపీఆర్డీ ఆనంద్ బాబు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్ విజేతలకు అభినందన



విద్యార్థిని భావనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో ఇద్దరు పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులు లభించాయి. ఎ. కొండూరు మండలం పోలిశెట్టిపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కొప్పుల మమతశ్రీ పదో తరగతిలో 583 మార్కులు సాధించి ఈ అవార్డుకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు పి. శోభన్‌బాబు తెలిపారు. తిరువూరు గీతమ్స్ స్కూల్ విద్యార్థిని డింపుల్ నాగలక్ష్మికి కూడా ఈ అవార్డు లభించింది ప్రిన్సిపాల్ చారి తెలిపారు. విద్యార్థులను వారు అభినందించారు.

- మైలవరం: మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ మీడియెట్ ఒకేషనల్ కోర్స్-ఓఏఎస్ చదివిన బాణావతు భావనకు రాష్ట్ర ప్రభుత్వ షైనింగ్ స్టార్స్ అవార్డు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ సరళకుమారి మంగళవారం తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వంచే నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ చేతుల మీదుగా ఈ అవార్డును విద్యార్థిని భావన అందుకుందని చెప్పారు. ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ సొంగా సరళకుమారి, సిబ్బంది అభినందించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నందిగామ టౌన్: సమాన పనికి సమాన వేతనాన్ని తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు పెంచాలని, మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులకు పీఆర్సీ వేతనాలు, కరువు భత్యం, ఐఆర్, ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్, నాన్ టెక్నికల్ వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ నాయకులు సైదా, కండెల శ్రీను, పరిమి రవి, దాసు, శ్రావణ్, బేబి, పల్లెకంటి ప్రసాద్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసి మెరుగైన సేవలందించాలి

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని హెచ్ఐవీ, ఎయిడ్స్, క్షయ, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది సమన్వయంతో పనిచేసి మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి పేర్కొన్నారు. బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో మంగళవారం ఎన్టీఆర్ జిల్లాలోని హెచ్ఐవీ, ఎయిడ్స్, క్షయ విభాగాల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగుల పనితీరును సమీక్షించారు. నాకో, ఏపీశాక్స్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ శ్యాంసన్, వాసవ్య మహిళా మండలి, షేర్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీఓ పుష్పలత

మైలవరం: బాల్య వివాహాలతో అనర్థాలపై మహిళలు, యువతులు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పుష్పలత అన్నారు. మైలవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు, జి.కొండూరు సెక్టార్ సూపర్‌వైజర్ డి. జోజి కటాక్ష్యం ఆధ్వర్యంలో మంగళవారం జి.కొండూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, లింగ వివక్షత, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం తదితర అంశాలపై కిశోర బాలికలకు, వారి తల్లులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలు చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. కిశోర బాలికలకు బాలల హక్కుల రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, వాటిని బాలికలు ఎదుర్కొనే మార్గాలను వివరించారు. ఎంఎస్‌కేలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

ఆగిరిపల్లి: నూజివీడు డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గురువారం విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ తెలిపారు. ఆగిరిపల్లిలోని పొన్నం కల్యాణ మండపంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినియోగదారుల నుంచి వినతులు స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. డివిజన్ పరిధిలోని ఆగిరిపల్లి, అడవినెక్కలం, ముసునూరు, రమణక్కపేట సెక్షన్ పరిధిలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల పరిషత్ సిబ్బంది బదిలీ

చాట్రాయి: ఉద్యోగుల బదిలీల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది బదిలీ అయ్యారు. మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కమల విష్ణు గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వి. సీతారామారావు ఎ. కొండూరు మండల పరిషత్ కార్యాలయానికి, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పిరంగి నవ్య తిరువూరు పంచాయతీరాజ్ శాఖకు బదిలీ అయ్యారు.

మట్టి రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు



మట్టి తవ్వకాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

జి.కొండూరు: కుంటముక్కల తూర్పు చెరువులో మట్టిని ఇటుక బట్టీలకు తరలించకుండా గ్రామస్తులు మంగళవారం ఉదయం మరోసారి అడ్డుకున్నారు. గ్రామాభివృద్ధికి నిధులు ఇచ్చే వరకు చెరువు మట్టిని తరలించేందుకు వీలులేదంటూ సోమవారం సాయంత్రం మట్టి రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు, మంగళవారం ఉదయం మరలా మట్టి రవాణా కొనసాగుతుండడంతో గ్రామస్తులు పెద్దఎత్తున చెరువు వద్దకు చేరుకొని ట్రాక్టర్లను అడ్డుకున్నారు. మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్న టీడీపీ నాయకులు గ్రామాభివృద్ధికి నిధులు ఇచ్చే విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వకుండా మట్టిని తరలించడం అహంకారపూరితమైన చర్య అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వివాదం ముదురుతుండడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. మట్టి తవ్వకాలను నిలిపివేసి పొక్లెయిన్‌లు, ట్రాక్టర్లను చెరువు నుంచి బయటకు పంపారు. ఇరు వర్గాలు ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాతనే మట్టి రవాణాను కొనసాగించాలని ఆదేశించారు. ఈ లోగా వివాదాలకు పోయి ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే వరకు వస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్టి తవ్వకాలు నిలిచిపోవడంతో గ్రామస్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నష్ట పరిహారం చెల్లించాలని ఆందోళన



మైలవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

మైలవరం: మైలవరం మండలం చంద్రాల గ్రామంలో ఆర్ అండ్ బీ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మైలవరం తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి బాధితులు ప్రయత్నించారు. చంద్రాల గ్రామానికి చెందిన 65 మంది ఇళ్లు, మరి కొంత మంది ఇళ్ల స్థలాలు కోల్పోయారు. 2016-17 సంవత్సరంలో రోడ్డు విస్తరణ పనులు జరిగాయి. దీనికి సంబంధించి బాధితులకు సుమారు రూ.6.75 కోట్లు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంది. నాటి నుంచి నేటి వరకు నష్టపరిహారం అందకపోవడంతో వారు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు, మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ నాడు మంత్రిగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావు గానీ, నేడు ఎమ్మెల్యేగా ఉన్న వసంత వెంకట కృష్ణప్రసాద్ కానీ, స్థానిక ప్రజాప్రతినిధులు కానీ దీనిపై స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. తహసీల్దార్ కలెక్టర్ సమావేశంలో ఉన్నానని, 15 రోజులు గడువు కావాలని బాధితులకు సొమ్ములు జమయ్యేలా చర్యలు తీసుకుంటానని కార్యాలయంలోని డెప్యూటీ తహసీల్దార్, ఆర్ అండ్ బీ అధికారుల ద్వారా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వజ్రాల వెంకటరెడ్డి, బాధితులు శివప్రసాద్, అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెరువు మట్టి తవ్వకాలు

పట్టించుకోని అధికారులు



మైలవరం ఎర్ర చెరువు నుంచి ట్రాక్టర్‌లో మట్టి రవాణా

మైలవరం: మైలవరంలోని ఎర్ర చెరువులో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇళ్లు, వ్యవసాయ భూములు మెరక చేసుకునేందుకు రైతుల పేరుతో కొంత మంది అనుమతులు తీసుకుని మట్టిని తవ్వి ఇటుక బట్టీలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. పొక్లెయిన్‌లు పెట్టి వందల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. అనుమతి పొందిన క్యూబిక్ మీటర్ల కన్నా అదనంగా మట్టి మాఫియా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

మట్టి తవ్వకాలతో చెరువులో పెద్దపెద్ద గుంతలు పడుతున్నాయి. వర్షాకాలం సమీపిస్తుండటంతో చెరువు నీళ్లతో నిండితే గుంతల లోతు కనిపించదు. పశువులు ఈ గుంతలలో పడి మృతి చెందే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మనుషులు సైతం గుంతల్లో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. అధికారులు స్పందించి మట్టి తవ్వకాలను నిలిపివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎదురెదురుగా వాహనాలు.. స్తంభించిన ట్రాఫిక్



జనార్దనవరం రోడ్డులో ఇరుకున్న లారీలు

చాట్రాయి: చాట్రాయి సెంటర్ ట్రాఫిక్‌కు నిలయంగా మారుతోంది. ఇరుకు రోడ్లు కావడం, వాణిజ్య సముదాయాల వద్ద పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పుకోవాలంటే వాహన చోదకులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అసలే గుంతలతో ధ్వంసమైన రోడ్డు, షాపుల ముందు వాహనాలు పార్కింగ్ చేయడంతో వాహనాలు తప్పుకునే వీలులేక ప్రజలు చాలా సేపు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సి వస్తోంది. మంగళవారం జనార్దనవరం రోడ్డులో ఎదరెదురుగా వస్తున్న రెండు లారీలు తప్పుకోవాలంటే అర గంట సమయం పట్టటడంతో ప్రయాణికులు వేరే మార్గం నుంచి వెళ్లాల్సి వచ్చింది. ఇప్పటికైనా నాలుగురోడ్ల సెంటర్‌లో ఏర్పడుతున్న ట్రాఫిక్‌ను పోలీసులు నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు మేలు

పుట్రేల(విస్సన్నపేట): పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం మేలని వ్యవసాయ శాఖ ఏడీ శశికళ అన్నారు. మండలంలోని పుట్రేల గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రం గరికపాడు, ఆచార్య రంగా వ్యవసాయ యూనివర్సిటీ, సీపీఎంసీ సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రైతులకు ఆధునిక సాంకేతిక సమాచారం, పంటల సాగులో మెలకువలు, సమగ్ర సస్యరక్షణ విధానం, యాజమాన్య పద్ధతులను వివరించారు.

విస్సన్నపేట, కొండపర్వ గ్రామంలోను ఈ కార్యక్రమం జరిగింది. ఏఓ రాజ్యలక్ష్మి, ఏఈఓ ఉషారాణి, హెచ్ఓ నరేంద్రకుమార్, రైతులు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

T.V.N. [illegible]